క్లుప్తంగా

ఘనంగా కల్యాణ మహోత్సవాలు

టి.కొత్తపాలెం(నాగాయలంక): స్థానిక శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు, ఫౌండర్ ట్రస్టీ బండ్రెడ్డి నాగిరెడ్డి, ఈఓ సీహెచ్ సుధాకరరావు పర్యవేక్షణలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్వామివారిని పెళ్లి కుమారుడు, అమ్మవారిని పెళ్లి కుమార్తెగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం రాత్రి 7గంటలకు శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరుని కల్యాణం జరుగుతుందని ఈఓ తెలిపారు.

క్రీడా దుస్తుల పంపిణీ

మోపిదేవి: సబ్‌జోన్, సెంట్రల్ జోన్‌లో విజయం సాధించిన 20 మంది క్రీడాకారులకు గురువారం స్థానిక ఆశ్రమ పాఠశాలలో మోపిదేవి మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు ఆధ్వర్యాన క్రీడా దుస్తులు అందజేశారు. రావి రత్నగిరి, ఎస్ జనార్ధనరావు, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఉదయభాస్కర్, వ్యాయామ ఉపాధ్యాయులు రామకృష్ణ, వసతి గృహ వార్డెన్ లంకేశ్వరావు పాల్గొన్నారు.

అరిగెల కృష్ణచౌదరికి నివాళి



మచిలీపట్నంటౌన్: జిల్లా ప్రభుత్వాస్పత్రి రిటైర్డ్ ఉద్యోగి అరిగెల కృష్ణచౌదరికి దళిత సంఘ నాయకులు గురువారం నివాళులు అర్పించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కృష్ణచౌదరి సంస్మరణ కార్యక్రమం గురువారం బలరామునిపేటలోని అంబేడ్కర్ కాలనీలోని ఆయన నివాసం వద్ద జరిగింది. రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్, వైఎస్సార్ సీపీ కృష్ణాజిల్లా కోశాధికారి డాక్టర్ బందెల థామస్‌నోబుల్, రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జక్కుల ఆనంద్‌బాబు(జాని), రిటైర్డ్ సీటీఓ బొనిగల రామారావు, గంద్రపు శీనయ్యమాస్టార్, కుంపటి జయకర్‌బాబు నివాళులు అర్పించారు.

లారీ ఢీ.. ఐదుగురికి గాయాలు

ప్రశాంతినగర్(మోపిదేవి): పెదప్రోలు శివారు ప్రశాంతినగర్ వద్ద 216 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. స్థానికుల నుంచి అందిన సమాచారం మేరకు కాసానగర్‌కు చెందిన పరదాలు కుట్టే కూలీలు గురువారం ఉదయం ఆటోలో మోపిదేవి వైపు వస్తున్నారు. మార్గమధ్యలో ప్రశాంతినగర్ వద్ద మరో కూలీని ఎక్కించుకుంటుండగా, వేగంగా వచ్చిన లారీ వెనకనుంచి బలంగా ఢీ కొంది. ఘటనలో ఆటోడ్రైవర్‌తో సహా మొత్తం ఐదుగురు గాయపడ్డారు. వారిని '108'లో అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి వెంకట లక్ష్మిని తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ బోల్తా

కృత్తివెన్ను: గాంధీనగరం సమీపంలో 216 జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో లారీ బోల్తా పడిన ఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుడివాడ నుంచి పాలకొల్లుకు వరికోత యంత్రంతో వెళుతున్న లారీ రోడ్డుకు ఉన్న రెయిలింగ్‌ను ఢీకొని పక్కనే ఉన్న చేలల్లోకి పల్టీ కొట్టింది. ఆ సమయంలో లారీలో ఇద్దరు వ్యక్తులు ఉండగా ఎటువంటి ప్రాణహాని జరగలేదు. గురువారం ఉదయం లారీని, వరికోత యంత్రాన్ని క్రేన్ సాయంతో తీసివేశారు.

భర్తపై మొదటి భార్య ఫిర్యాదు

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో భర్తపై మొదటి భార్య దిశా పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. భర్త తనకు తెలియకుండా వేరే యువతిని వివాహం చేసుకుని తన జీవితాన్ని నాశనం చేశాడంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ ఫిర్యాదులో పేర్కొంది. వివరాలు ఇలా ఉన్నాయి. బందరు మండలం పెదపట్నం గ్రామానికి చెందిన బుంగా రవితేజకు గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు గ్రామానికి చెందిన రామతేజకు 2020లో వివాహమైంది. మొదట్లో బాగానే ఉన్న రవితేజ ఆ తర్వాత నుంచి రామతేజను వేధించడం ప్రారంభించాడు. కొన్ని రోజుల క్రితం గుడ్లవల్లేరు పీఎస్‌లో ఫిర్యాదు సైతం చేసింది. రవితేజ ఆమెను బతిమలాడి పెద్దల సమక్షంలో ఆరు లక్షలు ముట్టజెప్పేలా మాట్లాడుకుని ఫిర్యాదును వాపసు తీసుకునేలా చేశాడు. ఆ తర్వాత భార్యకు ఒప్పందం ప్రకారం ఆరు లక్షలు ఇవ్వకపోగా ఆమెకు తెలియకుండా పెదపట్నం గ్రామానికి చెందిన మందపాటి భారతి యువతిని ఈ నెల 24న వివాహం చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రామతేజ తనకకు అన్యాయం జరిగిందంటూ ఎస్పీ ఆర్.గంగాధరరావుకు మీకోసంలో ఫిర్యాదు చేసింది. ఎస్పీ సదరు కేసును దిశా పోలీస్‌స్టేషన్‌కు సిఫార్సు చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితురాలు రామతేజ గురువారం దిశా పీఎస్‌లో తనకు జరిగిన అన్యాయాన్ని అధికారులకు వివరించింది. అంతేకాకుండా ఇతను మరో అమ్మాయిని కూడా వివాహం చేసుకున్నాడని తెలుస్తోంది. పోలీసులు నిత్య పెళ్లి కొడుకు ఆచూకీ కోసం గాలిస్తున్నారు. రవితేజతో పాటు అతని తల్లి, పిన్నిపైనా పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసును పరిశీలించి విచారణ చేయనున్నట్లు దిశా స్టేషన్ సీఐ వాస వెంకటేశ్వరరావు తెలిపారు.

సీఎం మాట.. నీటి మూట

- మచిలీపట్నం, చల్లపల్లి బైపాస్ పక్కన చెత్త నిల్వలు
- చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉంచుతామని సీఎం చంద్రబాబు హామీ
- అమలుకాని ఆదేశాలు
- గత ప్రభుత్వంలో చెత్త రీసైక్లింగ్ పనులు
- ప్రస్తుతం నిలిచిపోయిన వైనం



డంపింగ్ యార్డులో మళ్లీ చెత్త నిల్వలు వేస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: నగరంలో ఐదు నెలల క్రితం సీఎం చంద్రబాబు పర్యటించిన సమయంలో బందరులో చెత్త నిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుతామని మాట ఇచ్చారు. కానీ సీఎం మాట.. నీటి మూటలా మారింది. చెత్త లేకుండా డంపింగ్ యార్డును తొలగిస్తామని సీఎం మచిలీపట్నం పర్యటనలో ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలుకాలేదు. కార్పొరేషన్ పరిధిలో రోజూ సుమారు 90 టన్నుల ఘన వ్యర్థాలను సేకరిస్తున్నారు. ఈ చెత్తను మచిలీపట్నం–చల్లపల్లి బైపాస్ రోడ్డుకు ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డులో పడేస్తున్నారు.

రెండొంతులు యార్డులోనే..

రోజువారీ పడేసిన చెత్తను జిందాల్ పవర్ ప్లాంట్‌కు తరలించడమా లేక కంపోస్టుగా మార్చే ప్రక్రియ మొదలు పెట్టాలి. ప్రస్తుతం ఒక వంతు చెత్తను మాత్రమే పవర్ ప్లాంట్‌కు తరలిస్తూ రెండింతల చెత్తను యార్డులో డంప్ చేస్తున్నారు. దీన్ని సిబ్బంది తగలపెడుతున్నారు. రాజుపేట, కుమ్మరిగూడెం, ఎస్ఎన్ గొల్లపాలెం, సీతారామపురం, బీవీ తోట, గూడూరు, చల్లపల్లి ప్రాంతాల ప్రజలు ఈ మార్గంలో వెళ్తూ దుర్గంధానికి ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. డంపింగ్ యార్డు సమీపంలో నివాసితులు దుర్గంధం, చెత్త తగలబెట్టిన పొగతో అనేక రకాల శ్వాసకోశ వ్యాధులతో బాధ పడుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో చెత్త రీసైక్లింగ్.. నేడు బ్రేక్

డంపిగ్‌యార్డ్‌లో టన్నుల కొద్దీ పేరుకుపోయిన చెత్త నిల్వలను రీసైక్లింగ్ చేసే పనులను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టింది. దాదాపు 60 శాతం పైగా చెత్తను రీసైక్లింగ్ చేశారు. రోజూ వచ్చే చెత్తను జిందాల్ పవర్ ప్లాంట్‌కు పంపి చెత్త నిల్వలను నియంత్రించారు. దీంతో చెత్త నిల్వలు తగ్గుతూ వచ్చాయి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక రీసైక్లింగ్ పనులు నిలవడంతో యార్డులో మళ్లీ చెత్త నిల్వలు పేరుకుపోతున్నాయి.

ఇక్కడే పడేస్తున్నారు

కలెక్టర్ డీకే బాలాజీ అప్పుడప్పుడూ నగరంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుద్ధ్య సిబ్బందికి ఇవ్వాలని ఇంటింటికీ చెబుతున్నారు. కలెక్టర్ మాటకు విలువిచ్చిన ప్రజలు తడి, పొడి చెత్తను విడివిడిగానే అందిస్తున్నారు. సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రం ఇక్కడ లేకపోవడంతో ఈ ప్రక్రియ సత్ఫలితాలను ఇవ్వడం లేదు. ప్రజలు వేర్వేరుగా ఇచ్చిన చెత్తను చివరకు డంపింగ్‌యార్డ్ వద్ద కలిపేసే పడేస్తున్నారు.

నిరాశే ..

2024 అక్టోబర్ 2న స్వచ్ఛతాహి సేవలో భాగంగా మచిలీపట్నంలో పర్యటించిన సీఎం చంద్రబాబు రాష్ట్రంలో 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందని వ్యాఖ్యానించారు. నగరంలోని బైపాస్ రోడ్డు వద్ద డంపింగ్ యార్డును స్వయంగా పరిశీలించిన ఆయన ఇక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగించడానికి సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో శుభ్రత, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థిక ప్రగతిలో బందరు ముందడుగు వేయనుందని ఆశించిన నగరవాసులకు నిరాశే ఎదురైంది.



ఎస్ఎన్ గొల్లపాలెం రోడ్డు మార్జిన్‌లో వ్యర్థాలు వేస్తున్న దృశ్యం

స్వయంగా ముఖ్యమంత్రి చెత్త ప్రక్షాళన, తరలింపుపై హామీ ఇచ్చి ఐదు నెలలు గడుస్తున్నా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

తహసీల్దార్‌గారు ఎప్పుడొస్తారో..



గురువారం ఉదయం 11.42 లకు ఖాళీగా ఉన్న తహసీల్దార్ సీటు



తహసీల్దార్ కోసం చెట్ల కింద ప్రజల పడిగాపులు

చల్లపల్లి తహసీల్దార్ వనజాక్షి సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మధ్యాహ్నం 12 గంటలు అవుతున్నా రాకపోవడంతో కార్యాలయానికి వచ్చిన వారికి నిరీక్షణ తప్పడం లేదు. అలాగే కార్యాలయంలో సమావేశాలు జరుగుతున్నా ఆమె కానరావడం లేదు. గురువారం కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశానికి ఆమె రాకపోవడంతో పీడీఎస్ డీటీ, కార్యాలయ డీటీ నిర్వహించారు. తహసీల్దార్‌ను కలవడానికి వచ్చిన ప్రజలు చెట్ల కిందే ఆమె కోసం పడిగాపులు కాస్తూ కనిపించారు. ఆమె రాకపోకలను, సమయపాలనను సీసీ కెమెరాల్లో పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

–చల్లపల్లి

కార్తికేయుడి సన్నిధిలో మంత్రి అచ్చెన్నాయుడు




మోపిదేవి: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దంపతులు గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయంకు చేరుకున్న ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్ శర్మ, విరూప్ శర్మ స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. మండలి వెంకట్రామ్, ఇతర నేలు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన జక్కుల

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని జగన్‌మోహన్‌రెడ్డి నివాసంలో మచిలీపట్నంకు చెందిన రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జక్కుల ఆనంద్‌బాబు(జాని) గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని జాని తెలిపారు.

–మచిలీపట్నంటౌన్



మర్యాదపూర్వక కలయిక



ఎంవీఎస్ నాగిరెడ్డిని కలసి తిరుమాని తదితరులు

బంటుమిల్లి: వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డిని జిల్లా అధ్యక్షుడు తిరుమాని శ్రీనివాసరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రాము సూచనతో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. తిరుమానిని రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు.. గుడివాడలో నాగిరెడ్డిని కలిసి రైతుల స్థితిగతులపై చర్చించారు. జిల్లాలో రైతులు రెండో పంట సాగు చేసిన మినుములకు గిట్టుబాటు ధర రావడంలేదని, మొదటి పంట సార్వా ధాన్యం ఇంక రైతుల వద్ద ఉందని వాటిని కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు తీసుకునేందుకు కృషి చేయాలని నాగిరెడ్డి దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బండారు చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ కంచడం కన్వీనర్ గంధం శేషుబాబు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి చేసిన పాఠశాలలను మూసేస్తామనడం దారుణం

పెదప్రోలు సర్పంచి ఏసుబాబు

మోపిదేవి: గత ప్రభుత్వం నాడు–నేడు పేరుతో పాఠశాలలను అభివృద్ధి చేశారని దాన్ని మూసివేయడం కుదరదని పెదప్రోలు సర్పంచ్ పాలిమెట్ల ఏసుబాబు స్పష్టంచేశారు. ఈ క్రాప్ చేయించుకున్న తర్వాత పండించిన పంట(ధాన్యం) టార్గెట్ అయిపోయిందంటే రైతులు ఏమైపోవాలని మండల కో–ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు అధికారులను నిలదీశారు. మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. అధికార కూటమి నాయకులే గట్టిగా నిలదీయడంతో అధికారులు తెల్లమొహం వేశారు. మండలంలో పలు పాఠశాలలను విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే నెపంతో మరో పాఠశాలలో కలపడంతో అక్కడ నాడు–నేడు పనులతో అభివృద్ధి చేసిన స్కూళ్లు మూతపడే అవకాశం ఉందన్నారు. పేరెంట్స్ ఒప్పుకోవడం లేదని సర్పంచ్ ఏసుబాబు అన్నారు. పలు గ్రామాల్లో ఇంకా వరి కుప్పలు తీయలేదని, అలాంటప్పుడు ప్రభుత్వం టార్గెట్ ఎలా అయిపోయిందని రంగారావు వ్యవసాయాధికారులను నిలదీశారు. పండించిన రైతులు ఏమైపోతారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మండల ఉపాధ్యక్షులు కడవకొల్లు సీతారామాంజనేయులు, నడకుదుటి జననీ కుమారి, ఏవో పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఉపసర్పంచ్‌ల ఎన్నికలు



నాగాయితిప్ప ఉప సర్పంచ్‌గా ఎన్నికైన లక్ష్మీ వెంకట రమణకు నియామక పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి త్రిపుర సుందరి

పెదన: అచ్చయ్యవారిపాలెం, కాకర్లమూడి పంచాయతీలలో గురువారం ఉపసర్పంచిఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అంతకు ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు అచ్చయ్యవారిపాలెం సర్పంచు వైఎస్సార్ సీపీ మద్దతుతో వేముల సత్యనారాయణ ఏకగ్రీవం అయిన విషయం తెల్సిందే. తాజాగా జరిగిన ఉపసర్పంచి పదవిని పామర్తి రాముడు టీడీపీ మద్దతుతో ఏకగ్రీవం అయ్యారు. బంటుమిల్లి ఈవోపీఆర్డీ శైలజాకుమారి.. రాముడుకు ధ్రువీకరణ పత్రం అందజేశారు. కాకర్లమూడిలో జనసేన మద్దతుతో రావి విజయలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికవ్వడంతో పెడన ఎంపీడీవో కార్యాలయం ఏవో, ఎన్నికల అధికారి శిరిషాకుమారి ధ్రువీకరణ పత్రం అందజేశారు.

నాగాయితిప్పలో..

నాగాయితిప్ప(మోపిదేవి): నాగాయితిప్ప గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా పెనుమత్స లక్ష్మీ వెంకట రమణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి త్రిపుర సుందరి తెలిపారు. పాలక వర్గ సభ్యుల సమావేశం సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరావు అధ్యక్షతన నిర్వహించారు. పాలకవర్గ సభ్యులు ఏడుగురు చేతులెత్తి వెంకట రమణకు చేతులెత్తి మద్దతు తెలిపారు. పంచాయతీలో మొత్తం 10 మంది వార్డు సభ్యులు కాగా, ముగ్గురు గైర్హాజరయ్యారు. మిగిలిన సభ్యులతో ఎన్నిక నిర్వహించినట్లు ఎన్నికల అధికారి త్రిపుర సుందరి తెలిపారు. ఎన్నికైన ఉప సర్పంచ్ లక్ష్మీ వెంకట రమణను సర్పంచ్ వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో శాలువా కప్పి, సన్మానించారు. వైఎస్సార్ సీపీ సానుభూతి పరులే విజయం సాధించడంపై హర్షం వ్యక్తంచేశారు. చల్లపల్లి సీఐ ఈశ్వరరావుద ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. లింగం జగదీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భోగిరెడ్డిపల్లిలో..

మచిలీపట్నంరూరల్: భోగిరెడ్డిపల్లి పంచాయతీ ఉప సర్పంచ్‌గా కొక్కిలిగడ్డ రవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల ఇన్‌చార్జ్, ఈవోపీఆర్డీ ఎ.బాలకృష్ణారావు తెలిపారు. గురువారం పంచాయతీలో ఉపసర్పంచ్ ఎన్నిక జరగ్గా ఇతర నామినేషన్లు ఏమీ రాకపోవడంతో కొక్కిలిగడ్డ రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బాలకృష్ణారావు తెలిపారు. రవి కి ధ్రువీకరణ పత్రాన్ని ఈవోపీఆర్డీ అందజేశారు.

ఆకులమన్నాడులో..

గూడూరు: ఆకులమన్నాడు ఉపసర్పంచి పదవికి ఎన్నికలు నిర్వహించారు. ఎంపీడీఓ బి.రాజేశ్వరి ఆధ్వర్యాన జరిగిన ఎన్నికలో బాకీ హరీష్(నాని) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్పంచి మహ్మద్ రఫీ, గూడూరు డీసీ చైర్మన్ పోతన వెంకటలక్ష్మీ నరసింహస్వామి, ఎలకుర్రు సాగునీటి సంఘం అధ్యక్షుడు సూరారపు ఆంజనేయులు హరీష్‌ను అభినందించారు.

శ్రీకాకుళంలో..

శ్రీకాకుళం(ఘంటసాల): శ్రీకాకుళం పంచాయతీ ఉప సర్పంచ్‌గా శీలం శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. శ్రీకాకుళం పంచాయతీ కార్యాలయంలో శనివారం జరిగిన ఉప సర్పంచ్ ఎన్నికల్లో 12 మంది వార్డు సభ్యులకు గాను 10 మంది పాల్గొనగా వార్డు సభ్యుడు పవన్ కుమార్ ఉపసర్పంచ్‌గా శ్రీనివాసరావును ప్రతిపాదించగా పామర్తి రాంబాబు బలపర్చగా మిగిలిన సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో ఎన్నికల అధికారి వెంకటేశ్వరరావు శీలం శ్రీనివాసరావును ఉప సర్పంచ్‌గా ప్రకటించి ధ్రువీకరణ పత్రం అందించారు.

అవసరం మేరకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలి



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి భాస్కరరావు

బంటుమిల్లి: విద్యార్థులు అవసరం మేరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలని బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి, కమిటీ చైర్మన్ ఎం.భాస్కరరావు అన్నారు. స్థానిక వాగ్దేవి జూనియర్ కాలేజీలో గురువారం మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కాలేజీ డైరెక్టర్ రఘునాథ్ పర్యవేక్షణలో నిర్వహించిన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడుతూ వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సాంకేతిక పరిజానాన్ని పరిధికి మించి ఉపయోగిస్తే భవిష్యత్ అంధకారమవుతుందని హెచ్చరించారు. పలు చట్టాలపై అవగాహన కలిగించారు. ఈ సదస్సులో న్యాయవాదులు వై. శ్యాంబాబు, పీఈ వెంకటేశ్వరరావు, ఈవీఎస్ రాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బాధ్యతల స్వీకరణ

మోపిదేవి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్‌గా (టీఏ) కె. భాగ్యలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కోడూరు మండలంలో పనిచేస్తూ బదిలీపై మోపిదేవికి వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న టీఏ హరిబాబునాయక్ ఘంటసాల మండలానికి బదిలీపై వెళ్లినట్లు తెలిపారు.

రామలింగేశ్వరుని ఆదాయం రూ. 2.92 లక్షలు

మచిలీపట్నంటౌన్: రాబర్ట్‌సన్‌పేటలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను లెక్కించారు. సంవత్సరం ఆరు రోజులకు రూ. 2,92,811 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. మచిలీపట్నం డివిజన్ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, పోలీసు, రెవెన్యూ అధికారుల సమక్షంలో కానుకల లెక్కింపు జరిగింది.

200 మందికి అన్నదానం

చల్లపల్లి: స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి గుడి వద్ద గురువారం శివశంభో సేవా సంస్థ ఆధ్వర్యంలో 200 మందికి అన్నదానం చేశారు. ప్రతి ఊరిలో ఇలా అన్నదాన కార్యక్రమాలు చేస్తూ శివశంభో సంస్థ సామాజిక బాధ్యతను వివరిస్తూ ప్రజలను మంచి మార్గం వైపు నడిచేలా బోధిస్తూ ఉంటామని సభ్యులు తెలిపారు.

విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ

ఘంటసాల: ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న చిరుధాన్యాలు, తృణ ధాన్యాలు, పప్పు ధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ శిక్షణ కార్యక్రమం బుధవారం రెండో రోజుకు చేరుకుంది. కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ రాగులు, జొన్నలు యొక్క ఉపయోగాలు, లభించే పోషకాలు, వివిధ రకాల విలువ ఆధారిత ఉత్పత్తులను వివరించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

సూర్యఘర్‌ను డ్వాక్రా మహిళలు వినియోగించుకోవాలి

ఘంటసాల: విద్యుత్ ఆదా చేయడంతో పాటు ఆదాయం పొందడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సూర్యఘర్ పథకాన్ని డ్వాక్రా మహిళలు వినియోగించుకోవాలని ఘంటసాల మండల విద్యుత్ శాఖ ఏఈ పి.రవి కుమార్ అన్నారు. ఘంటసాల వెలుగు కార్యాలయంలో డ్వాక్రా వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ రవి కుమార్ మాట్లాడుతూ అర్హులైన ఎస్సీలకు ఉచితంగా సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ బిగిస్తారన్నారు. ఇన్‌చార్జి ఏపీఎం టి.శ్రీనివాసరావు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు టి.పార్వతి, ట్రెజరర్ వి.వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో 'మహాప్రస్థానం'



అవనిగడ్డ: చైల్డ్‌హుడ్ ఫ్రెండ్స్ సేవాసంస్థ ఆధ్వర్యంలో మహాప్రస్థానం రథాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. సంస్థ స్థానిక కార్యాలయం వద్ద ఈ వాహనాన్ని గురువారం సంస్థ ప్రతినిధులు ప్రారంభించారు. అవనిగడ్డ పట్టణంలో ఎవరైనా మరణిస్తే మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకెళ్లడానికి ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఈ వాహనాన్ని సమకూర్చినట్టు సేవాసంస్థ కార్యదర్శి లీలా కృష్ణ తెలిపారు. గతంలో సొంతిల్లు లేనివారు అపరకర్మలు చేసుకోవడానికి పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కొత్తపేట రోడ్డులో చైల్డ్‌హుడ్ ఆధ్వర్యంలో షెడ్‌ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. స్థానిక కోర్టు సెంటర్‌లోని సంస్థ కార్యాలయం వద్ద ఈ రథాన్ని అందుబాటు ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సంస్థ జాయింట్ సెక్రటరీ గోపాలకృష్ణ, సభ్యులు కమ్మిలి ప్రసాద్, బండే శ్రీనివాస్, అన్నపరెడ్డి కృష్ణ, యాసం శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వడ్డీ రాయితీతో రూ.4.65 లక్షలు చెల్లింపు

పెడన: పట్టణంలో గుడివాడ రోడ్డులో ఉన్న ఎస్‌బీహెచ్ బ్యాంకు భవన యాజమానులు 2019–20 నుంచి ఆస్తి పన్ను కింద రూ.6,05,436 బకాయి పడ్డారు. ఆస్తిపన్నుపై వడ్డీలో 50 శాతం రాయితీ కల్పించడంతో గురువారం పురపాలక సంఘ కార్యాలయానికి సదరు యాజమానులు చేరుకుని అసలు రూ.3,25,436తో పాటు వడ్డీ రూ.2.80లక్షలకు 50 శాతం రాయితీ పోనూ రూ.1.40లక్షలు వెరసి రూ.4,65,436లను పురపాలక సంఘానికి ఆస్తిపన్ను కింద మున్సిపల్ కమిషనర్ ఎం గోపాలరావు, మేనేజర్ ఎం రాజా, ఆర్ఐ పామర్తి వెంకటేశ్వరరావుకు నగదు అందజేసి రశీదు పొందారు. అవకాశాన్ని వినియోగించుకుని ఆస్తి పన్ను చెల్లించాలని కమిషనర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఉపసర్పంచ్ సత్యనారాయణపై అవిశ్వాస తీర్మానం నోటీసులు

అవనిగడ్డ: అవనిగడ్డ పంచాయతీ ఉపసర్పంచ్ కోడూరు సత్యనారాయణపై కొంతమంది వార్డు సభ్యులు అవిశ్వాస తీర్మానాన్ని గురువారం ఎంపీడీవో మరియదేవికి అందించారు. మాజీ ఉపసర్పంచ్ గాజుల జయగోపాల్ ఆధ్వర్యాన మెజారిటీ వార్డు సభ్యులు కార్యదర్శి అనితకు అవిశ్వాస తీర్మానాన్ని అందజేశారు. కార్యక్రమంలో పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గంగానమ్మ జాతర.. భక్తులతో కళకళ



ప్రత్యేక అలంకారంలో కోడూరు గంగాభవానీదేవి

కోడూరు: కోడూరు గంగానమ్మ జాతర వేళ ఆ ప్రాంగణమంతా భక్తులతో కళకళలాడింది. 50 ఏళ్ల నుంచి కొనసాగుతున్న ఆచారం ప్రకారం ఈ ఏడాది కూడా కోడూరు పోలీసులు అమ్మవారికి తొలిపూజలు చేసి జాతరకు శ్రీకారం చుట్టారు. అమ్మవారి పుట్టింటివారైన కంచర్లపల్లి వంశీయులు ఉదయం పసుపు, కుంకుమ, చీరలు, పూలదండలు, గాజులను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన ప్రభను దేవాలయం చుట్టూ తిప్పి, సారెను పండితులకు అందించారు. కోడూరు పీఎస్ వద్ద నుంచి పోలీసులుకుటుంబసభ్యులతో అమ్మవారిని తీసుకువెళ్లేందుకు ఊరేగింపుగా ఆలయానికి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. డీజే పాటలు, డప్పువాయిద్యాలకు అనుగుణంగా భక్తులతో కలిసి సిబ్బంది డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ ఆలయంలో అమ్మవారికి పోలీసులు పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారిని ఉంచి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి తొలిపూజలు చేశారు. అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ, సీఐ యువకుమార్, ఎస్ఐలు చాణిక్య, పూర్ణమాధురి దంపతులు, సిబ్బంది కుటుంబసభ్యులతో పూజలు నిర్వహించారు. గ్రామోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నెల 30,31 తేదీల్లో అమ్మవారి ప్రధాన గుడిజాతరను నిర్వహించనున్నట్లు ధర్మకర్త యుగంధరరావు తెలిపారు.



అమ్మవారి విగ్రహంతో ప్రదక్షిణలు చేస్తున్న పండితులు, పోలీసులు